బస్టాండు నిర్మించారు.. గాలికి వదిలేశారు..!

- రూ2.20 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణం
- వినియోగంలోకి రాని బస్టాండ్
- కనీస అవసరాలు కూడా ఏర్పాటు చేయని వైనం
- ప్రయాణికులకు తప్పని అవస్థలు


వేంపల్లెలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండు

వేంపల్లె : పాలకుల నిర్లక్ష్యం కారణంగా వేంపల్లె పట్టణంలోని నూతన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. వేంపల్లె పట్టణ సౌకర్యార్థం గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో గత ఏడాది శిథిలావస్థకు చేరుకున్న పాత బస్టాండ్‌ను పగులగొట్టి నూతన బస్టాండును నిర్మించారు. చిన్న చిన్న పనులు మినహా నూతన బస్టాండు దాదాపు పూర్తయింది. అయితే సార్వత్రిక ఎన్నికల రావడంతో నిర్మాణ పనులు ఆపివేశారు. తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఐదు నెలలు కావస్తున్నా వినియోగంలోకి తీసుకురావడంలో మాత్రం ఆటు ఆర్టీసీ అధికారులు, ఇటు పాలకులు దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నూతన బస్టాండు అధికారుల అలసత్వం కారణంగా నిరుపయోగంగా మారింది. రూ.2.20 కోట్లతో నిర్మించిన నూతన బస్టాండు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. ఐదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లె నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, తిరుపతి తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఈ బస్టాండ్‌లో వచ్చి పదినిమిషాలు ఆగేవి. అయితే నూతన బస్టాండు నిర్మిస్తుండటంతో బస్సులు రోడ్డుపైనే ఆగి ఆగనట్లుగా వెళ్ళిపోతున్నాయి. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే పట్టణ ప్రజలు వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. కనీస వసతులు సమకూర్చకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే కూర్చోలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆరు ప్లాట్‌ఫాంలతో బస్టాండు నిర్మాణం

వేంపల్లె ఐదు మండలాలకు కూడలిగా విస్తరించాలనే లక్ష్యసాధనకు నూతన బస్టాండ్ నిర్మాణం దోహదపడుతుందని భావించి గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో వెయిటింగ్ హాల్, ఆరు ప్లాట్ ఫారాలు, పార్సిల్ విభాగం, ఏర్పాటు చేశారు. వాషింగ్ రూమ్, చిన్న, చిన్న మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులన్నింటినీ 10 రోజుల్లో పూర్తి చేయవచ్చని అధికారులు అంటున్నారు. ఇకనైనా అధికార పార్టీ నాయకులు, పాలకులు, ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకుని బస్టాండ్ ను వినియోగంలోకి తీసుకురావాలని చుట్టూ గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



వేంపల్లె నుంచి ఇతర నగరాలకు వెళ్లేందుకు బస్సు సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నాం. బస్టాండు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తే సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది. అంతేకాకుండా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది.

- పి.లక్ష్మీదేవి, స్థానికురాలు, వేంపల్లె

బస్టాండును వాడుకలోకి తేవాలి



ప్రభుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధి పనులు ఆగకూడదు. ప్రభుత్వ ధనంతో చేపట్టిన పనులు నిరుపయోగంగా మారకూడదు. రూ.2.20 కోట్ల వ్యయంతో నిర్మించిన బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు అధికార పార్టీ నాయకులు, పాలకులు తగిన చర్యలు తీసుకోవాలి.

- ఆదిమూలం ఉత్తయ్య, స్థానికుడు, కాపు వీధి, వేంపల్లె

రెండు నెలల్లో వినియోగంలోకి తెస్తాం

బస్టాండు ఆవరణలో మరుగుదొడ్లు తదితర మౌలిక వసతుల పనులను చేపట్టాల్సి ఉంది. ప్రయాణికుల కోసం సీటింగ్ ఏర్పాటు చేయాలి. టాయిలెట్ల నిర్వహణకు కాంట్రాక్టర్‌ను ఎంపిక చేయాలి. ఈ పనులన్నీ త్వరితగతిన పూర్తిచేసి రానున్న రెండు నెలల్లో బస్టాండ్లను వినియోగంలోకి తీసుకొస్తాం.

- రామకృష్ణ, ఆర్టీసీ డీఎం, పులివెందుల

భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం వివిధ దశలలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పొన్న శివయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్‌లు తెలిపారు. మంగళవారం ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో వారు విలేఖర్లతో మాట్లాడారు. భూమి కోల్పోయిన భూ నిర్వాసితులకు 50 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని జీవో 98లో స్పష్టంగా ఉన్నప్పటికి ప్రభుత్వ ఉత్తర్వులను జెన్‌కో యాజమాన్యం అమలు చేయకుండా నిర్లక్ష్యంగా కాలయాపన చేస్తోందన్నారు. ఆర్టీపీపీలో జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్ (జేపీఏ) ఉద్యోగాలు వందలాది ఖాళీగా ఉన్నాయని ఇప్పటి వరకు నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు.

25న జాబ్ మేళా

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 25న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు శ్రీరామ్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, డిక్సన్ టెక్నాలజీస్ వంటి సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. మండలంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 89198 60680 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

నేడు మున్సిపల్ సమావేశం

కమలాపురం : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ మార్పురి మేరీ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే చైతన్యరెడ్డి హాజరు కానున్నారని, మున్సిపల్ పాలక వర్గం హాజరు కావాలన్నారు.

పోలీసుల సేవలు చిరస్మరణీయం

కమలాపురం : విధుల్లో అమరులైన పోలీసుల సేవలు చిరస్మరణీయం అని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గంగవరంకు చెందిన విధుల్లో అసువులు బాసిన వి.యశ్వంత్ అనే కానిస్టేబుల్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

ముద్దనూరు : స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం పశువైద్యాధికారులు గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. జమ్మలమడుగు డివిజన్ సహాయసంచాలకులు వెంకటరామిరెడ్డి ఈ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. 950 గొర్రెలకు, 175 మేకలకు నట్టల నివారణ మందులను వేశామని పశువైద్యాధికారి శ్రీనివాస తెలిపారు. అర్హులైన గొర్రెల కాపరులు గొర్రెల షెడ్డులకు దరఖాస్తుచేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కొండాపురం పశువైద్యాధికారి రాజశేఖర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

లింగాల : డెంగీ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య తెలిపారు. మంగళవారం లింగాలలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారి చేసి, ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యకమములో సీహెచ్ఓ శివరాం, పీహెచ్ఎన్ కుసుమకుమారి, సూపర్‌వైజర్ హాషియా బేగం , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

పులివెందుల రూరల్ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ ఫోకస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సావరీ మైండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధి అమిత్‌కుమార్ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ ఫోకస్ మీద విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణ కాంతి, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ నివాళి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వేల్పుల సొసైటీ మాజీ అధ్యక్షుడు ముల్లంగి శివశంకర్‌రెడ్డి మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మృతుడి స్వగృహానికి చేరుకుని శివశంకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, పీసీబీ మాజీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి, నివాళులర్పించారు.

కమలాపురం : మండల వైఎస్సార్ సీపీ నాయకుడు పుట్లంపల్లెకు చెందిన సుదర్శన్‌రెడ్డి తండ్రి వెంకట సుబ్బారెడ్డికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి నివాళులర్పించారు.

నేత్రదానం

వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మళ్లకుంట్ల శివశంకర్‌రెడ్డి (45) మంగళవారం హఠాన్మరణం చెందడంతో ఆయన తల్లి తులశమ్మ ఇతర కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు. ఆయన మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని విశ్వభారతి వీధికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయురాలు కర్ణా లక్ష్మీనారాయణమ్మ(80) అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు.

గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు : వాతావరణ పరిస్థితులు మారుతుండటంతో గొర్రెలు అనారోగ్యానికి గురి అయ్యే అవకాశం ఉందని గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గూడెంచెరువు పరిధిలో ఉన్న గొర్రెలకు నులిపురుగు మందులను పంపిణీ చేశారు. ఈనెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు గొర్రెలకు ఉచితంగా నులి పురుగు మందు తాపిస్తామన్నారు. రైతులు, పశువుల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సుధాకర్‌బాబు సూచించారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి


కమలాపురంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. మంగళవారం మండలంలోని జంభాపురం, ఎల్లారెడ్డిపల్లె సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆధార్‌లో చిరునామా మార్పు, బయోమెట్రిక్, సెల్ నెంబర్ లింక్ తదితర సేవలు అందిస్తున్నామని, మండల ప్రజలు, విద్యార్థులు, రైతులు అన్ని వర్గాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సింహాద్రిపురం : ఆధార్ సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం మండలంలోని అంకాలమ్మ గూడూరు గ్రామంలో ప్రత్యేక ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

లింగాల : కామసముద్రంలో నిర్వహించిన మొబైల్ ఆధార్ కేంద్రానికి విశేష స్పందన లభించింది. డిజిటల్ అసిస్టెంట్ పృథ్వీ ఆధార్ కార్డులను నమోదు చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మండలంలోని గ్రామ సచివాలయాలలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. మంగళవారం పలు గ్రామాలలో నిర్వహించిన ఆధార్‌క్యాంపులను ఆయన పరిశీలించి మాట్లాడారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో ఆధార్ మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముకుందరెడ్డి తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కమలాపురం : రైతులు తాము సాగు చేసిన పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కోగటం, సంబటూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది... కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మినుము, వేరు శనగ, వరి పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. వరి పంటలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

తొండూరు : మండలంలోని భద్రంపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు చీనీ తోటలో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు చీనీలో సోకే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. అలాగే ఉద్యాన శాఖలో వివిధ పథకాల గురించి వివరిస్తూ శాశ్వత పందిర్లు, కర్బూజ దోస పంటలకు ప్లాస్టిక్ మల్చింగ్ పేపర్లపై ఆసక్తి ఉన్న రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

వీరపునాయునిపల్లె : భూసార పరీక్షలు చేయించడం వలన అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని మొయిళ్లచెరువు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించకుండా ఎన్ని రకాల ఎరువులు, పురుగుమందులు వాడినా ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

హైకోర్టు తీర్పును అధికారులు అమలు చేయాలి


విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న అధ్యక్షుడు, తదితరులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న 2018 కాంట్రాక్టు గెస్టు ఫ్యాకల్టీకి టైం స్కేల్ జీతాలపై హైకోర్టు ఇచ్చిన ఇంటిరిన్ ఆర్డర్‌ను ట్రిపుల్‌ఐటీ అధికారులు అమలు చేయాలని కాంట్రాక్టు గెస్టు ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ కోరారు. మంగళవారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్, ఎఓ పెనుకొండ రవికుమార్, డైరెక్టర్ కుమార స్వామి గుప్తాలకు కాంట్రాక్టు గెస్టు ఫ్యాకల్టీ అసోసియేషన్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. గతంలో పని చేసిన ఛాన్సలర్ కెసి రెడ్డి టైం స్కేల్ ప్రకారం జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం జరిగిందన్నారు. ఎగ్జిక్యూటివ్ సమావేశంలో 2018లో చేరిన కాంట్రాక్టు గెస్టు ఫ్యాకల్టీలకు చెందిన జీతాలపై చర్చించాలని కోరారు. అలాగే హైకోర్టు ఇచ్చిన ఇంటిరిన్ ఆర్డర్‌ను అమలు చేయాలని కోరారు.

హై టెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటును అడ్డుకుంటాం

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండలంలోని కొలుములపల్లి గ్రామ పొలాల్లో ఏర్పాటు చేస్తున్న అనంతపురం-కడప 400కేవీ విద్యుత్ హై టెన్షన్ లైన్ల నిర్మాణంను అడ్డుకుంటామని కొలుములపల్లి రైతులు పవర్ గ్రిడ్ అధికారులను హెచ్చరించారు. రీ సర్వే చేయాలని పవర్ గ్రిడ్ అధికారులకు వారు వినతి పత్రం అందజేశారు. తమ భూములు కోట్ల రూపాయలు విలువ చేస్తాయని పొలాల్లో హై టెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో భూముల విలువ పడిపోతుందని, వాటినే నమ్ముకుని ఇంతకాలం జీవిస్తున్నామన్నారు. పవర్‌గ్రిడ్ అధికారుల తప్పుడు సర్వే ఏర్పాట్లతో తాము నష్టపోవడానికి సిద్ధంగా లేమని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామన్నారు. రీసర్వే చేసి టవర్ లోకేషన్ నెంబరు ఏపీ 67 (డీడీ106) నుంచి (ఏపీడీ బీ2+06) పవర్ లోకేషన్ వరకు సమీప చింతకొమ్మదిన్నె గుట్టపై నుంచి వెళ్లే విధంగా మార్పు చేయాలని కోరారు.

మొక్కలను సంరక్షించడం మన బాధ్యత

వేంపల్లె : మొక్కలు నాటి వాటిని సంరక్షించడం మన బాధ్యత అని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శివమునెమ్మ తెలిపారు.

మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో భారత ప్రభుత్వం క్రీడా మంత్రిత్వ శాఖ, కడప నెహ్రూ యువకేంద్రం, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తల్లికి వందనం పేరిట మొక్కలు నాటడం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఏక్ పెయిడ్ మాకే నామ్' కార్యక్రమం కింద ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి సంరక్షించడం ఎంతో మంచిదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు మల్లేశ్వరమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయాలి

వేంపల్లె : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసిరెడ్డి, ధృవకుమార్‌రెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవాం పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద వారు నిరసన కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిందని.. అయితే మహిళలకు సంబంధించిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పోస్టు కార్డు ద్వారా సీఎం చంద్రబాబుకు లేఖలు పంపినట్లు తెలిపారు.

నేత్రదానంను ప్రోత్సహించాలి

పులివెందుల రూరల్ : నేత్రదానంను ప్రోత్సహించి అంధరహిత సమాజం నిర్మిద్దామని ఆర్డీఓ భానుశ్రీ తెలిపారు. మంగళవారం నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నేత్రాలు దానం చేసిన వారి కుటుంబ సభ్యులకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పాల్గొని నేత్రదాతల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. అనంతరం సేవా సమితి నూతన భవన నిర్మాణానికి రూ.5757ల నగదును పాఠశాల విద్యార్థులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మౌనిక, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ వరలక్ష్మి, హెడ్మాస్టర్ కమలనాథ శర్మ, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు : నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ సెంటర్ అధికారి వినీల్ తెలిపారు. మంగళవారం స్థానిక న్యాక్ సెంటర్‌లో నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించారు. అనంతరం టాటా, అమర్‌రాజా కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం జాబ్ మేళాకు 56 మంది హాజరు కాగా అందులో 18 మంది జాబ్‌కు సెలెక్టు చేసుకున్నట్లు తెలిపారు.

ఆస్తి పన్నులు వసూలు చేయాలి

పులివెందుల టౌన్ : వందశాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సూచించారు. మంగళవారం పట్టణంలోని వంద శాతం ఆస్తి పన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సంచార పన్ను వసూలు కేంద్రాలను ఏర్పాటు చేసి వాటిని ప్రజల ఇంటి వద్దకే వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేసే విధంగా ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా సకాలంలో పురపాలక సంఘానికి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులను చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ముని కుమార్ పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల తనిఖీ

పులివెందుల రూరల్ : మండలంలోని పురుగుమందుల దుకాణాలను డీడీఎస్ సాయిల్ కన్జర్వేషన్ ఎల్ అనిత, ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, టెక్నికల్ ఏవో సునీల్‌కుమార్‌రెడ్డి, ఏఓ నాగలక్ష్మిలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు స్టాకు రిజిష్టర్‌లో ఉన్న బ్యాలెన్స్, గ్రౌండ్ బ్యాలెన్స్‌లను తనిఖీ చేశారు. డీడీఎస్ ఎస్‌సీఎల్ అనిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రైతులకు పురుగుమందు ఉన్నటువంటి బిల్లును తప్పకుండా ఇవ్వాలన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

జమ్మలమడుగు : పుట్టుకతోనే శ్వాస సంబంధమైన వ్యాధితో పుట్టిన బిడ్డ చికిత్స నిమిత్తం పతంగేరామన్నరావు పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు రూ.67వేలు ఆర్థిక సాయం అందించారు. హాజీ, ఆఫ్రీన్ దంపతులకు మహమ్మద్ ఆయాన్ జన్మించాడు. పుట్టుకతోనే ఊపిరితిత్తుల సమస్యతో జన్మించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కడపలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఐదు లక్షల వరకు ఖర్చు పెట్టుకున్నారు. ఇంకా డబ్బులు అవసరం కావడంతో మంగళవారం రూ.67వేలు అందించారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు


లింగాల : రైతుల భూ సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్

కమలాపురం : భూ సమస్యల పరిష్కారం కోసమే భూ రీసర్వే చేపట్టినట్లు జిల్లా ల్యాండ్ సర్వే ఆఫీసర్ మురళీకృష్ణ, మండల తహసీల్దార్ శివరామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని సి.గోపులారం సచివాలయంలో రెవెన్యూ సదస్సు-గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ సమస్యలున్న రైతులు ఇచ్చిన అర్జీలను పరిష్కరించేందుకే ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విస్తీర్ణంలో సమస్యలున్నా, సర్వే నెంబర్లలో ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని అక్కులగారిపల్లెలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలో గతంలో నిర్వహించిన సమగ్ర భూసర్వేలో తప్పొప్పులను సవరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టాదారు పాసు పుస్తకాలలో పేరు, తండ్రి పేరు, భర్త పేరు, సర్వే నెంబర్లు వంటి లోటుపాట్లను సవరించడం జరిగిందని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని దేవతాపురం గ్రామంలో భూ రీసర్వే గ్రామసభ నిర్వహించారు. డీటీ శ్రీహరి, సచివాలయ సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన డీఏవీ విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన డీఏవీ స్కూల్ విద్యార్థులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్ తెలిపారు. ఈనెల 21వ తేదీన ఎస్వీ హైస్కూల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ ఖోఖో, జూనియర్ అసోసియేషన్ మీట్‌లో హరిత, గీత, లోహిత, యోగ, రాఘవ, రమణ, యతిష్‌లు జూనియర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి ఎంపికైనట్లు తెలిపారు. వీరందరు ఈనెల 25, 26, 27వ తేదీలలో కాణిపాకంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. అదేవిదంగా ఎస్‌జీఎఫ్ అండర్-17లో యతిష్, సుశాంత్, కిరణ్, గీత, లోహితలు ఎంపికయ్యారని వీరందరు నవంబర్ నెల 2, 3, 4 తేదీలలో అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. అండర్-14 విభాగంలో సాహితీ, అమృత, రాఘవ, వికాస్‌లు ఎంపికయ్యారని వీరందరు నవంబరు నెల 9, 10, 11లలో కరంపూడిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

వారి జాబ్‌కార్డ్‌లు తొలగించండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ

జమ్మలమడుగు రూరల్ : కొంత కాలం నుంచి గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనులకు రానీ కూలీల జాబ్ కార్డులు తొలగించాలని జిల్లా డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో 19వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలో దాదాపు 20 వేల జాబ్ కార్డ్స్ ఉన్నా 10 వేల మంది మాత్రమే పనులకు వస్తున్నారు. ఎందుకు రావడంలేదని ఆమె ఉపాధిహామీ ఏపీఓను ప్రశ్నించారు. అటువంటి వారి జాబ్‌కార్డులు తొలగించాలని సూచించారు. గత ఏడాది కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనుల కంటే అధికంగా బిల్లులు చేశారు. అటువంటి వారికి షోకాజ్ నోటీస్ ఇచ్చిన ఇంతవరకు ఎందుకు స్పందించడంలేదని ఆమె మండిపడ్డారు. అనంతరం ఏపీఓ పద్మారాణి మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 910 పనులకు గాను రూ.6 కోట్ల 69 లక్షల ఖర్చు అయిందన్నారు. అధికారుల ప్రజావేదికలో రూ.18,486 రికవరి చేశామని అధికారులు చెప్పడం గమనార్హం. విజిలెన్స్ అధికారి రామలింగేశ్వరరెడ్డి, డ్వామా క్వాలిటి కంట్రోల్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

కమలాపురం : ప్రపంచ జ్ఞాన సంపాదన మీ లక్ష్యం అని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే మీరు అనుకున్నది సాధించవచ్చని సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. మంగళవారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలన పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వ్యక్తిత్వానికి ఉపయోగపడే పాజిటివ్ థింకింగ్ అలవర్చుకోవాలన్నారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలు దరిచేరితే కనీసం మూడు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రుపాయల జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్, కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్, పరీక్ష నియంత్రణ అధికారి కృష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీబీఆర్‌కు చేరుతున్న వరద నీరు


సీబీఆర్ జలాశయానికి చేరుతున్న వరద నీరు

లింగాల : మండలంలోని పార్నపల్లె చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వరద జలాలు చేరుకుంటున్నాయని సీబీఆర్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. గత రెండు రోజులుగా అనంతపురం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు సీబీఆర్ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు చేరుతోందన్నారు. సోమవారం రాత్రి సీబీఆర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన భారీ వర్షాలకు రోజుకు 10వేల క్యూసెక్కుల చొప్పున సీబీఆర్‌కు నీరు చేరుకుంటోందని ఆయన తెలిపారు. ప్రస్తుతం సీబీఆర్ జలాశయంలో 7.6 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. మరో ఒక టీఎంసీ నీరు సీబీఆర్‌లోకి చేరే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా కోమన్నూతల, పార్నపల్లె తదితర ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలకు లింగాల కుడికాలువకు భారీగా నీరు చేరుతున్నాయి.


లింగాల కుడికాలువలో ప్రవహిస్తున్న వరద నీరు